క్లుప్తంగా

ఓటర్ స్లిప్పులను త్వరగా పంపిణీ చేయండి



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాలలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపయోగించే ఓటర్ స్లిప్పుల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి ఆదేశించారు. మండలంలో మొత్తం 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అందుకు సంబంధించి ఆయా గ్రామాలలోని ఓటర్ స్లిప్పులను బీఎల్ఓలకు అందజేశామని, మూడు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాలలో బీఎల్ఓలు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత



పెబ్బేరు రూరల్: మండలంలోని చెలిమిల్ల శివారులో ఓ ఇంట్లో మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. పెబ్బేరు పట్టణంలోని చెలిమిల్ల శివారులో ఓ ఇంట్లో శ్రీరాములు మద్యం అమ్ముతున్నారని సమాచారం రావడంతో పోలీసులు అతని ఇంట్లో సోదా చేయగా 30 లీటర్ల మద్యం లభించిందని, వాటి విలువ రూ.17 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆత్మకూర్‌కు బస్సులను పెంచాలి

మరికల్: ఆత్మకూర్ మరికల్ మధ్యన బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. రెండు పట్టణాల మధ్యన సరైన బస్సులు లేక వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు రాత్రి 8 అయిందంటే చాలు బస్సులు లేక బస్టాండ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి 8 తర్వాత కూడా మరికల్ నుంచి ఆత్మకూర్ నుంచి బస్సులు ఉండాలన్నారు. రెండు పట్టణాల మధ్యన కేవలం రెండు బస్సులు మాత్రమే నడిపించడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనలను సంప్రదించాల్సినా పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బస్సులను నడిపించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అప్‌లైడ్ న్యూట్రీషన్ సబ్జెక్టు–1 అతిథి అధ్యాపక నియమానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీలోగా కళాశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత, బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న ఉదయం 11గంటలకు ఎంఏఎల్‌డీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీను, సలహాదారులుగా గోపీ, రాజన్న, వెంకటేష్, ఆంజనేయులు, శివశంకర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు.

డాక్టరేట్ ప్రదానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ స్కాలర్ రాజ శ్రీనాథ్‌కు సోమవారం పీయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 'సూక్ష్మజీవుల సంవర్ధనం, సంవర్ధనం చేయలేని లైపేజ్, ప్రొటియేజ్ ఎంజైమ్స్' అంశంపై రీసెర్చ్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, తదితరులు అభినందించారు. అధ్యాపకులు శాంతిప్రియ, మధుసూదన్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం

- వనపర్తి నియోజకవర్గంలో బీజేపీకి అవకాశం ఇచ్చి చూడాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞ రెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్, టీచర్స్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.
- పాన్‌గల్ మండలంలోని అన్నారంతండాలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు సోమవారం జూపల్లి అరుణ్, రాము యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు.

రెండేళ్లలో 'ఏదుల' పూర్తిచేశాం

వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



గోపాల్‌పేట హనుమాండ్లగడ్డ కాలనీలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి/గోపాల్‌పేట: ఒకేసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. సీఎం చొరవతో వ్యవసాయ మంత్రిగా అభివృద్ధి జిల్లాను దక్షిణ తెలంగాణలోనే అగ్రగామిగా నిలిపానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సోమవారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారం చేసిన మంత్రి మాట్లాడారు. జిల్లా వరప్రదాయినిగా భవిష్యత్‌లో జిల్లాకు సాగు, తాగునీరందించనున్న ఏదుల రిజర్వాయర్‌ను అతి తక్కువ కాలం రెండేళ్లలో పూర్తి చేసి చూపించానన్నారు. జూరాల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నాలుగు దశాబ్దాలు నిర్లక్ష్యం వహించిన కాంగ్రెస్‌కు రైతులపై చిత్తశుద్ధిలేదన్నారు. సీఎం సహకారంతో వనపర్తి జిల్లాగా అప్‌గ్రేడ్ చేసుకోవటంతో అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులతో పాటు కలెక్టర్, ఎస్పీ లాంటి సివిల్ సర్వీసెస్ అధికారులు అందుబాటులోకి వచ్చారన్నారు.

3 నుంచి 33కు మెడికల్ కళాశాలలు

రాష్ట్ర ఆవిర్భావంకు ముందు కేవలం మూడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్యను 33గా మార్చేందుకు ఏటా కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేసినట్లు మీరు గుర్తిస్తే.. మరోసారి ఓటువేసి ఆశీర్వదించాలని మంత్రి ప్రజలను కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పెద్దమందడి మండలం మనిగిళ్ల ఉపసర్పంచు వాకిటి బాలరాజు 300మందితో సోమవారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీనివాస్‌పురం మాజీ సర్పంచ్ సురేష్ తన మద్దతుదారులతో బీఆర్ఎస్‌లో చేరారు. అడ్డాకుల మండలం కనుమనూర్ కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యురాలు వాసీమాబేగం, పెబ్బేరు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు సుమారు వంద మంది, తాడిపర్తి టీడీపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.



కారుగుర్తుకు ఓటేయాలని ప్రచారంలో చూపిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అభివృద్ధి పథంలో శాఖాపూర్

పెబ్బేరు రూరల్: మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వై.శాఖాపూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపారని మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి అన్నారు. సోమవారం మండలంలోని వై.శాఖాపూర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాములు, కొందండరామిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కొల్లాపూర్: సీఎం కేసీఆర్ ద్వారా తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు మౌలాలి ఆధ్వర్యంలో 150 మంది, చుక్కాయిపల్లి, కుడికిళ్ల చెందిన బీఎస్పీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు చేసిన అభివృద్ధి పనులను, తన హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. గతంలో ప్రజలను ఇబ్బందులు పెట్టిన నాయకులు మళ్లీ మీ ముందుకు వస్తున్నారని, వారిని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, కాటం జంబులయ్య, పరశురాం తదితరులున్నారు.

ఇంటింటి ప్రచారం

బీఆర్ఎస్ నాయకులు సోమవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంట తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, గాలియాదవ్, జాఫర్, రుక్మద్దీన్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన వైస్ ఎంపీపీ

కోడేరు: మండలంలోని తుర్కదిన్నెకు చెందిన వైస్ ఎంపీపీ కొత్త వెంకటేశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ద్వారానే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, రెండవ సారి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పాన్‌గల్: నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గౌరారం వెంకట్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ప్రచారం నిర్వహించారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూర్: భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలలో భాగంగా సోమవారం పట్టణంలోని సేవామందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మందికి ఉపయోగపడుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ కలాంపాషా అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తిప్పారెడ్డి, వేణుగోపాల్, రఘు, ముక్తేశ్వర్, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగుడెంలో సోమవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలలో భద్రతపై నమ్మకం పెంచేందుకు రోడ్డు వెంబడి కవాత్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగన్న పోలీసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



పోటీలను ప్రారంభిస్తున్న నర్సింహులు

నారాయణపేట రూరల్ : క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో జిల్లా స్థాయి అండర్–17 కబడ్డీపోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడలకు సమయం కేటాయిస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారుచేయొచ్చన్నారు. మనిషి జీవితంలో వ్యాయామానికి మించిన మెడిసిన్ లేదన్నారు. క్రీడా కోటలో సైతం ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుకు సీట్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జట్టును ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, పీఈటీలు నర్సింహులు, రమణ, నెల్సన్, సాయినాథ్, వెంకటప్ప, శ్రీధర్, రమేష్, విష్ణు, వెంకటేష్; అనంతసేనా, రాజేశ్వరీ, రాధిక, స్వప్న, కృష్ణవేణి, చక్రవర్తి పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి, అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: కేంద్రం ప్రభుత్వం ఢిల్లీ నుంచి గల్లీ వరకు సంక్షేమ పథకాలు ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో పేదలకు అందిస్తుందని కోలార్ ఎంపీ మునిస్వామి అన్నారు. సోమవారం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఊట్కూర్ మండలం ఎర్గట్‌పల్లి, మాగనూర్ ఓబ్లాపూర్, వడ్వాట్‌లో ప్రచారం కొనసాగించారు. గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రచార కార్యక్రమంలో కొండయ్య, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, కర్నిస్వామి, నాగప్ప, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి అన్నారు. సోమవారం మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లో మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ఆనంద్, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కుర్నిఉదయ్, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్ తదితరులు ఉన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : జాతీయ కుంఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రుషికుమార్, సాయిప్రణవ్, హర్షవర్ధన్, నరేందర్‌గౌడ్ చక్కటి ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా ఖలీం, రాహుల్, నరహరి, రియాజ్, సాత్విక్‌లు వెండి, స్టీఫెన్, భూపతి, వెంకటేష్ కాంస్య పతకాలను సాధించారు. ఆయా విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఖాజా హుస్సేన్, అబ్దుల్ అలీం, శివకుమార్‌గౌడ్, ఖదీర్, ఖాజా మైనోద్దీన్, నారాయణ అభినందించారు.

విద్యార్థి అదృశ్యం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. కేశంపేట కొత్తతండాకు చెందిన భీంసింగ్, సబావత్ సీతమ్మలకు ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నకుమారుడు రవికుమార్ వనపర్తిలో ప్రైవేట్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగ రోజు నుంచి ఇంటికి రాలేదు. దీంతో సోమవారం కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



సంగినేనిపల్లిలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సమాఖ్య అధికారులు

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని మండల మహిళా సమాఖ్య ద్వారా గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఏపీఎం బిచ్చన్న రైతులను కోరారు. సోమవారం సంగినేనిపల్లి, బొల్లారం ఇతర గ్రామాలలో మహిళా సంఘ సభ్యులు, రైతులతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ మాధవస్వామి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని ఐకేపీ సీసీలు నాగరాజు, స్వామి, ధనలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని రాయినిపల్లి, కేతేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కేంద్రాల్లో విక్రయించే ధాన్యానికి ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తారని పేర్కొన్నారు. తూకం విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు నిర్వహించాలన్నారు.

బీజేపీతోనే రాష్ట్రం సుభిక్షం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధాకర్‌రావు

పెంట్లవెల్లి: బీజేపీతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కొల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి పలువురు యువకులు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎల్లేని సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు యువకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

పాన్‌గల్: నియోజకవర్గ అభివృద్ధికి కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు తరపున సోమవారం మండలంలోని కేతేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఇప్పటికే జాతీయ రహదారి, సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జి మంజూరు చేయించామని బీజేపీ అభ్యర్థిని ఆదరిస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్వేష్, రోజారమణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

60ఏళ్లుగా చేయని అభివృద్ధి.. ఇప్పుడేం చేస్తారు



నర్సింగాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: అసమర్థ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కొత్తగా చేసేదేమీ లేదని, 60 ఏళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడు కొత్తగా గెలిచి ఎలా చేస్తారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

మండలంలోని అజ్జకొల్లు, నెలివిడి, నర్సింగపురంలో సోమవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. నర్సింగపూర్‌లో రూ.18.73 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సాగునీరు, 24 గంటలతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతిపక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదని, బీఆర్ఎస్ గెలిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సర్పంచ్‌లు బ్రహ్మమ్మ, కోట్ల రాములమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. ప్రజల వెంటే ఉంటా



నాగల్ కడ్మూర్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

అమరచింత: ఒక్కసారి ఆశీర్వదించి గెలిపిస్తే నిత్యం నియోజకవర్గ ప్రజల వెన్నంటే ఉంటానని మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో అమ్మపురం దొర శ్రీరాంభూపాల్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్, టీడీపీ నుంచి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. నాగల్‌కడ్మూర్, అమరచింత, ఆత్మకూర్, నర్వ, చెందిన పలువురు అమ్మపురం సంస్థానదీశుడు రాజా శ్రీరాం భూపాల్, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజలను కులాల వారీగా విభజించి వారిలో మతవిద్వేశాలను రగిల్చి దేశ సంపదను దోచుకోవడంలో బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కగూటి పక్షులన్నారు. దేశ ప్రజల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవడమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగ విఫలమైందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రజలు మతోన్మాద రాక్షసుల చేతిలో ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోనే స్థితిలో ప్రధాని లేరన్నారు.

ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయం

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని మక్తల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. నియోజకవర్గంలోని మండలంలోని అంజప్ప ఆధ్వర్యంలో దాదాపు వంద మందికి పైగా వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చిట్యాల కో ఆప్షన్ సభ్యుడు రహిమాత్ పాష ఆధ్వర్యంలో పలువురు చేరారు. వారికి కండువాలతో సన్మానం చేరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి నేటి వరకు ఉందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. అనంతరం మక్తల్‌లో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, లక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, హన్మంతు, ప్రశాంత్ కుమార్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, గోపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంటా, ఐనాపూర్, అలంపల్లి, తంగిడి, గుర్జాల్, కృష్ణా, హిందుపూర్‌లో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. యువకులు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ఎర్రవల్లిచౌరస్తా: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్‌తో పాటు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇటిక్యాల గురుకుల పాఠశాలకు చెందిన రంగస్వామి, ఉదయ్‌కిరణ్, విష్ణువర్ధన్, కార్తిక్, నిఖిల్‌తో పాటు ఎర్రవల్లి (అయిజ) గురుకుల పాఠశాలకు చెందిన సిద్దార్థ్, ప్రశాంత్, రాజశేఖర్, అశోక్‌లు ఈనెల 18 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని పొందిన విద్యార్థుల బృందంతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల పీడీ భాస్కర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాళ్లు గిరిధర్, రాంమూర్తి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.